# దగ్ధగీతం

'అనవసరంగా చాలా కాలం బ్రతికాను నేను' అనుకున్నాడు సేతురామన్.

ఆ చిన్నవరండాలో స్తంభానికి ఆనుకుని కూర్చుని ఉన్నాడు. తల అక్కడక్కడ నెరిసింది. కళ్ళు లోతుకుపోయి, ముఖం ముడతలుపడి. అకాల వార్ధక్యం పైబడిన వాడిలా ఉన్నాడు. నిన్నరాత్రి ఆ సన్నటి వరండాలో చాపమీద నిద్రపోదామని విశ్వప్రయత్నం చేశాడు,కానీ ఫలించలేదు. పైగా కన్ను మూస్తే అన్నీ పీడకలలూ, వికృతమైన దృశ్యాలూ... నిన్ననేకాదు. నాలుగు రోజులనుంచీ అంతే.

ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది. తలతిప్పి చూస్తే డాక్టరు... సేతురామన్ లేచి నిలబడ్డాడు. డాక్టరు యువకుడు. సేతురామన్ వంక పలకరింపుగా చూసి నవ్వాడు. సేతురామన్ కళ్ళలో అకస్మాత్తుగా నీటిపొర కమ్ముంది. స్తంభానికి ఆనుకుని అలాగే నిలబడ్డాడు. డాక్టరు గుమ్మంలోనే నిలబడి కొద్దిక్షణాలు చూశాడు. లోపలికి పోలేదు. లోపలికి పోనవసరంలేదని సేతురామన్‌కి తెలుసు.డాక్టరు చివాలున వెనుదిరిగి సేతురామన్ ప్రక్కగానే నడిచి అవతలి వైపుకి వెళ్ళిపోయాడు. డాక్టరు బూట్లశబ్దం అతని నోటివెంట వెలువడిన మాటలను పూర్తిగా అణచలేక పోయింది. సేతురామన్‌కు, ఆ మాటలు స్పష్టంగానే వినబడ్డాయి.'పూర్ సోల్, షి ఈజ్ వెయిటింగ్ ఫర్ డెత్....'సేతురామన్ మళ్ళీ స్తంభానికి ఆనుకుని కూలబడ్డాడు. వెనక రెండు గదులు ....మరీ పెద్దవేమీ కాదు. ఎడమవైపు గది ఖాళీ.... కుడివైపు గదిలో.... కుడవైపు గదిలో.... సేతురామన్ కళ్ళు తుడుచుకున్నాడు.

కుడివైపు గదిలో అతని సంగీత సామ్రాజ్యం శిథిలమై, దగ్ధమై, బూడిదయిపోతున్నది. ఇవాళ్టికి సరిగా నాలుగురోజుల నుంచీ.... నాలుగు పగళ్లూ, నాలుగు రాత్రులు.

ముందు పెద్ద ఆస్పత్రి భవనం.... అందులో మామూలు మనుషులకు మామూలు సౌకర్యాలున్న గదులు.... ప్రత్యేక వ్యక్తులకు ప్రత్యేక సౌకర్యాలున్న గదులున్నాయి. అక్కడ ఎక్కడా ఖాళీలేదు. వెనక ఈ రెండు గదుల కట్టడం ఎందుకు ఉందో తెలీదు.... ఇక్కడే ఖాళీ దొరికింది. సేతురామన్ చేతివ్రేళ్లు విరుచుకున్నాడు. పొద్దున ఆసుపత్రి బయట తాగిన టీ తాలూకు అరుచి నాలుకను ఇంకా అంటిపెట్టుకొనే ఉంది. నీరసంగా ఉంది.... మనసంతా వికారంగా ఉంది.

అకస్మాత్తుగా ఆస్పత్రి వెనక రైలు ఒకటి కూత వేసుకుంటూ రణగొణధ్వని చేస్తూ వెళ్లింది. అది చాలా దూరం పోయిన తరువాత కూడా ఆ వికృత శబ్దం అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది.

ఎప్పటెప్పటివో దృశ్యాలు....

ఎండాకాలం.... మధ్యాహ్నం.... విశాలమైన పెరటిలో పెద్ద సీమ చింత చెట్టు.... (లేక బాదం చెట్టా ?).... కింద వెలుగును ముక్కలు ముక్కలుగా కత్తిరించి పోసినట్టున్న ఎండ.... చెట్టు మొదట్లో కూర్చున్న పంకజవల్లి.... సన్న సన్నగా కబుర్లు.... చిరుతిళ్లు.... చిరుచిరు తగవులు ....చిరునగవులు.

సేతురామన్ ఉలిక్కిపడి చూశాడు. ప్రహరీ గోడమీద రంగు రంగుల పక్షి ఏదో కూర్చుని పెద్ద గొంతుతో అరుస్తున్నది. ఒకప్పుడెప్పుడో.... ఎండాకాలం. మధ్యాహ్నం వేళ... చెట్టుకొమ్మల్లో ఎక్కడో కోయిల కూస్తుంటే తామిద్దరూ రెట్టించేవారు.... తాము రెట్టించే కొద్దీ కోయిల మరీ రెచ్చిపోయి కూస్తూ ఉండేది. చివరకు తామో, కోయిలో,

ఎవరో ఒకరు అలసిపోయి మానేసే వరకూ కొనసాగేది ఆ సంబరం.... కోయిలను చూద్దామని ఎన్నోసార్లు ఎంతో ప్రయత్నం చేశారు. కానీ అదె ప్పుడూ వారికి కనబడలేదు. అవును.... కోయిల అలిసిపోయింది.... నలిగిపోయింది.... క్రుంగి పోయింది.... ఆ చిన్ని మేనులో పీసమెత్తు కూడా శక్తి మిగల్లేదు.

సేతురామన్ లేచాడు. నెమ్మదిగా అడుగులు వేస్తూ గుమ్మంలోకి వెళ్ళి నిలబడ్డాడు. కిటికీ పక్కన ఇనుపమంచం.... కిటికీలో నుంచి ఉమ్మెత్త చెట్టు ఒక్కటి మాత్రం గోడప్రక్కన కనిపిస్తున్నది. గదిగోడలు తెల్లగా ఉన్నాయి. మంచం పక్కన పాతచెక్క బీరువా. సేతురామన్ గుండెలు చేత్తో రుద్దుకున్నాడు.... అంతలో దగ్గు వచ్చింది. ప్రయత్న పూర్వకంగా దగ్గు ఆపుకుంటూ మళ్లీ కళ్ళెత్తి చూశాడు.

తెల్లని దుప్పటిలో శుష్కించిన శరీరం పైన ముంజేతులు, తల మాత్రం కనిపిస్తున్నాయి. ఒక చేతికి ఒకే ఒక ఎర్ర రంగు గాజున్నది. గుండెలమీద ఉన్న రెండో చేతికి ఏమీలేదు.... పైన సన్నని కంఠం.... నల్లని కంఠం....దేశం అంతటా సంగీత మాధుర్యాన్ని పంచిన కంఠం.... బండరాళ్ళవంటి హృదయాలను జల జల కరిగించిన కంఠం.... ఆ పైన చామనఛాయ ముఖం....సన్నని ముక్కు....తెల్లని పెద్దపెద్ద కళ్ళు.... (అవి ఇప్పుడు మూతపడి ఉన్నాయి. మళ్లీ తెరుచుకుంటాయో లేదో తెలీదు). ముంగురులు సన్నని గాలి విసురుకు బలహీనంగా కదులు తున్నాయి.... శుష్కించిన చెక్కిలిమీద ఒకవైపు సన్నగా చెమట....

సేతురామన్ ఇవతలకి వచ్చాడు. ఆస్పత్రి ప్రక్కగా యెవరో పెళ్ళికి తరలివెడుతున్నారులా వుంది. సన్నాయి మృదువుగా గాలిలో తేలి తేలి వస్తున్నది.

అతనికి అంతలో బీడీ కాల్చాలనిపించింది. చొక్కా జేబులో ఒక్కటే బీడీ మిగిలివుంది. కానీ అగ్గిపెట్టె లేదు. అందువల్ల ఆ కోరికను

అణుచుకున్నాడు. బీడీని అవతల పారేద్దామనుకున్నాడు. కానీ మళ్లీ మనసు మార్చుకుని జేబులోనే వుంచుకున్నాడు. తన ఆస్తి.... గొప్పదేమీ కాదుగానీ అంతా వీటికే హరించుకుపోయింది. పెళ్ళి చేసుకుని ఒక యింటి వాడివి కమ్మనీ, కుదురుగా వుండమనీ ఎంతగానో నచ్చజెప్పిన తల్లీ తండ్రీ పోయారు. ఇంకెవరూ మిగల్లేదు. ఆస్తి హారతి కర్పూరంలాగా కాకపోయినా నెమ్మది నెమ్మదిగా హరించుకుపోయింది.... సన్నాయి వాద్యం పూర్తిగా దూరమైపోయింది. ఇప్పుడేమీ శబ్దంలేదు.

సేతురామన్‌కు పంకజవల్లి పెళ్ళి గుర్తుకు వచ్చింది. అప్పటికే ఆమె సంగీత సామ్రాజ్యాన్ని పరిపాలించే సూచనలు స్పష్టంగా ఉన్నాయి. ఆమె రవిని ప్రేమించింది. మూర్తీభవించిన పురుష సౌందర్యానికి అబ్బుర పడి అతన్ని ఆరాధించింది. వారి పెళ్ళి అట్టహాసంగానే జరిగింది. పలువురు ఆ వివాహాన్ని ఆదర్శ వివాహమని కొనియాడారు. ఎక్కువ మంది పెళ్ళి కుమారుణ్ణే మెచ్చుకున్నారు. ఎంత సంగీత సరస్వతి అయితే మాత్రం, అంత అందగాడు చేసుకోదగిన పిల్లకాదని కొందరు అనుకున్నారు. మరికొందరు అతని కళా ప్రియత్వాన్ని కొనియాడారు. ఎందరెన్ని అన్నా, ఎందరెన్ని అనుకున్నా రవి చిరునవ్వుతోనే వున్నాడు తప్ప ఎవరికీ ఏమీ తెలియనీయలేదు. సేతురామన్ మాత్రం అంత హడా విడిలోనూ ఒంటరిగా కూర్చుని తన ఆలోచనల్లో తానుండిపోయాడు. తాను చిన్నప్పటి నుంచీ ఎవరిని కోరుకున్నాడో, ఎవరిని ప్రేమించాడో ఆమె తనకు దక్కకుండా పోయినందుకు అతడేమీ బాధపడలేదు. ఆమె ప్రేమిం చినవాణ్ణి చేసుకుంటున్నందుకు ఆనందించాడు కూడా. ఇదంతా జరిగి దాదాపు పదేళ్ళు....రవి చాలా జాగ్రత్తపరుడు. తనకు ఏమేమి కావాలో వాటిని సాధించి సమకూర్చుకోగల తెలివితేటలు పుష్కలంగా వున్నవాడు. భార్య చేయవలసిన కచేరీలూ .... అక్కడ వసూలు చేయవలసిన మొత్తాలూ....చెక్కులు, అకౌంట్లు అన్నీ అతడే చూసుకునేవాడు. ఆ

విషయాల్లో బహుజాగ్రత్తగా, ఖచ్చితంగా ఉండేవాడు. ఎప్పుడన్నా పంకజవల్లి "నాకు వొంట్లో బాగులేదు. జ్వరం....కచేరీకి వెళ్ళలేను. ఓపిక లేదు" అంటే "అమ్మమ్మా ! ఎంతమాట ? అలా అనకు, వాళ్ళ దగ్గర ముందే డబ్బు కూడా తీసుకున్నాను. వెళ్ళకపోతే వీల్లేదు. మామూలు జ్వరానికే కచేరీ ఎగ్గొట్టేస్తే ఎలా ? తప్పు డియర్...." అనేవాడు. మరొకప్పుడెప్పుడన్నా "ఏమండీ, అతనెవరో అనాధ శరణాలయం సహాయం కోసం కచేరీ యివ్వమంటున్నాడు. పాపం ! వందమంది అనాధలైన పిల్లలు తిండీ తిప్పలూలేక అల్లాడిపోతున్నారట" అంటే - అందంగా నవ్వి, "భలేదానివే. ఇలా పైసా ఇవ్వలేని వాళ్ళకోసం కచేరీ చేస్తే నీ ఆరోగ్యం ఏం కాను ? అలాటివన్నీ పెట్టుకోవద్దు. అనాధలకు ఎవరో డబ్బున్నవాళ్ల దానం చెయ్యాలి గాని మనం ఎంతని చేస్తాం ? అలాటి విషయాలు నాకొదిలెయ్ డియర్ !" అనేవాడు.

సేతురామన్ జేబులు వెతుక్కున్నాడు. బాగా నలిగిపోయిన రూపాయి నోట్లు రెండూ, కొంత చిల్లరా మిగిలిఉంది. అంత ఆస్తికి ఈ నాటికి మిగిలిందిది. పెద్దయిల్లూ....పల్లెటూర్లో మూడెకరాల మాగాణీ.... పొగాకు పండే నాలుగెకరాల మెట్ట. ఇంతకు మిగిలింది ఇదే !

ఆమె పెళ్ళయినప్పటి నుంచీ, సేతురామన్ వారియింటి ఎదురుగానే ఒక రెండుగదులవాటా అద్దెకు తీసుకుని అందులో ఉండేవాడు....పైపనికి ఒక కుర్రవాణ్ణి, ఒక వంట మనిషినీ కుదుర్చుకుని ఉండేవాడు. అలా ఏళ్లు గడిచాయి. పంకజవల్లినీ, రవినీ గమనిస్తూనే ఉండేవాడు. పంకజవల్లిని గురించి చాలా మాటలు విన్నాడు. ఎవరూ రవిని ఏమీ అనలేదు. ఆమెను గురించే అందరూ అన్నారు. ఆమె డబ్బు మనిషయిపోయిందనీ, డబ్బు లేకపోతే గొంతెత్తి పాడదనీ, స్వార్థపరురాలై పోయిందనీ, సంగీతాన్ని అమ్ముకుంటున్నదనీ....ఇలా చాలా విన్నాడు. జనానికి ఆ డబ్బంతా.... ఏ ఖాతాలోకి వెడుతున్నదో, ఎవరి చేతుల్లోకి వెడుతున్నదో తెలిస్తేగా ?

చాలా తక్కువసార్లు ఆమె సేతురామన్‌తో మాట్లాడింది. మాట్లాడినప్పుడు చాల తక్కువగా మాట్లాడింది....రవిపట్ల ఉన్న ఆకర్షణ, రవి అంటే తన్మయత్వం ఆమెలో తగ్గడం సేతురామన్ గమనించాడు. ఆమె ఉదాసీనంగా అప్పుడప్పుడూ దీనంగా, ఒంటరిగా ఇంట్లో ఉండటం అతడు గమనించాడు. డబ్బు.... వేలకువేలు డబ్బు చేసిపెట్టే ఆమె కంఠం రవికి కావాలి....అందవిహీనమైన ఆమె, ఆమె శరీరం ఆ శరీరంలోని మనసు ఇవేవీ అతనికి అక్కర్లేదు....అతనికి కావలసిన అందమైన శరీరం అతడు వేరే ఏర్పాటు చేసుకున్నాడు....క్రమక్రమంగా కచేరీ ఏర్పాట్లు తారీకులు, వగైరాలు తప్ప ఆమెతో అతనికేమీ సంబంధం లేకపోయింది. ఇల్లు మాత్రం గడుపుతూ ఉండేవాడు....ఇల్లంటే, ఉన్నది ఎంతమంది గనుక ? భార్య, ఆమెను కనిపెట్టుకుని ఉండే మరొక మనిషి. అంతే....కచేరీకి వెళ్ళవలసి వచ్చినపుడు కారులో వచ్చి తీసుకుపోయేవాడు. అది పూర్తి కాగానే తీసుకొచ్చి దించి వెళ్ళిపోయేవాడు, ఇటీవల ఒకసారి "గొంతు మంటగా ఉంది. నేను కచేరీ చెయ్యలేను" అంటే పెద్దగా మాట్లాడి కోపగించి భయపెట్టి తీసుకువెళ్ళాడు. ఆమె తిరిగివచ్చి బాధతో మెలికలు తిరిగిపోతుంటే సేతురామన్ గబగబా వెళ్ళాడు. ఆమె దగ్గిదగ్గి చివరకు చారెడు రక్తం కక్కింది అతనికి అప్పుడు గుండెలు దడదడలాడాయి.

సేతురామన్ కాళ్ళు బారజాపుకుని కూర్చున్నాడు. పదిగంటలవుతుందేమో ఈ చుట్టుపక్కల మంచి హోటలు ఏదీలేదు. రాత్రి ఆస్పత్రి ముందు చిన్న హోటల్లో తిన్న రొట్టె యింకా కడుపులో అలాగే ఉన్నట్టుంది.

అయిదారు నెలల క్రిందట ఒకనాడు రవి కారులో వచ్చి భార్యను తీసుకుపోవడం చూశాడతడు. తనవాటా వరండాలో నిలబడి ఉండి, తాన లాగే నిలబడి ఉన్నాడు. అరగంటలో వాళ్ళు తిరిగి వచ్చేశారు. తర్వాత

రవి ఒంటరిగా బయలుదేరి వెళ్ళిపోయాడు. "ఏం జరిగిందో తెలుసుకుందామ"ని ఎంతగానో ఆశించినా ఆ సాయంకాలం వరకూ అతనికి వీలు పడలేదు. సాయంకాలం ఆరుగంటలవేళ పంకజవల్లితో వుండే నలభై ఏళ్ళ వనజమ్మ బైటికి వచ్చింది. సేతురామన్ ఆమెని పిలిచి కబుర్లలో పెట్టి నెమ్మదిగా విషయం తెలుసుకున్నాడు. వనజమ్మ గదిబయట వుండి అంతా విన్నది. అందువల్ల ఆగలేక సేతురామన్‌కు చెప్పేసింది. సేతురామన్ అది విని ఎండుటాకులా నిలువునా ఒణికిపోయాడు.... నిలవలేక కూలబడి పోయాడు.... శిలా ప్రతిమలా అలాగే గడ్డకట్టుకు పోయాడు.... క్యాన్సర్ ఆ చిన్ని గొంతులో క్యాన్సర్.... అతనికి ఏడుపొచ్చింది.

ఇక ఆ తర్వాత కథంతా చాలా త్వరగా జరిగిపోయింది. రవి పది రోజులు గడిచాక ఒకసారి మాత్రం వచ్చి ముక్తసరిగా ఒక అరగంట ఉండి వెళ్ళిపోయాడు. తర్వాత పది రోజులు పత్తాలేదు. మళ్ళీ వచ్చి వనజమ్మ చేతికి కొంచెం డబ్బిచ్చి వెళ్ళిపోయాడు. అదే చివరిసారి అతడు వూళ్ళోనే మళ్ళా కనిపించలేదు.

సేతురామన్ అప్పుడప్పుడూ ఎదురింటికి వెళ్ళి మాట్లాడి వచ్చేవాడు మామూలు మాటలు... మధ్యమధ్యలో చిన్నప్పటి కబుర్లు .... ఆమె ఎక్కువసేపు నిశ్శబ్దంగా వుండేది. మాట్లాడేందుకు బాధపడేది.... మాట్లాడబోతే దగ్గు తెరలు తెరలుగా వచ్చేది దగ్గి దగ్గి నెత్తురు కక్కి నిశ్శబ్దంగా పడుకుండిపోయేది .... ఒకటి రెండు మాటలు మాట్లాడినా స్వరం తెగిపోతూ వికృతంగా వినిపించేది- "నువ్వెందుకు .... పెళ్ళి చేసుకోలేదు!" "ఏమీ ఉద్యోగం లేకుండా .... ఎందుకిలా .... వున్నావు?" ఇలాటి తెగిన ప్రశ్నలు.

అతడు ఒకనాడామెతో అన్నాడు. "వల్లీ! ఇలా చూడు .... రవిని గురించి కనుక్కున్నాను. అతను ఇల్లు ఖాళీచేసి బెంగుళూరులో యెక్క

డికో వెళ్ళిపోయాట్ట.... బ్యాంకులో డబ్బంతా విత్‌డ్రా చేసుకుపోయాడు. అసలు నీకు తెలీదేమో, మీ పెళ్ళయిన ఆర్నెల్లకే అతనింకొక పెళ్ళి చేసుకున్నాడు. అది ఎటువంటి పెళ్ళో తెలీదుగానీ మొత్తంమీద మరో అమ్మాయితో వున్నాడన్నాళ్ళూ.... ఇప్పుడిక వెళ్ళిపోయాడు." ఆమె వింటూ నవ్వుతూ తల వూపింది. సేతురామన్ ఆశ్చర్యపోయి "అయితే యిన్నాళ్ళనుంచీ అంతా నీకు తెలుసా?" అని అడిగాడు. ఆమె మళ్ళీ తల వూపింది. సేతురామన్ కాసేపు ఏమీ మాట్లాడలేదు. కొన్ని క్షణాల తరవాత లేచి "డాక్టరు దగ్గరికి తీసుకు వెడతాను. రా.... నేనంతా కనుక్కున్నాను. యిప్పుడేమీ ముంచుకుపోలేదు. ఇప్పుడైనా ఆపరేషన్ చెయ్యొచ్చు ... ఆపరేషన్ చేస్తే ప్రాణం దక్కుతుందన్నాడు డాక్టరు...." అన్నాడు.

ఆమె చివాలున తలయెత్తి "ప్రాణం దక్కుతుంది. కానీ గొంతు పోతుంది....జీవితాంతం మూగగా....గొంతులేకుండా బతకాలి...."అన్నది.

"అవును ....గొంతు లేకపోతేనేమి? నువ్వు బతుకుతావు.... బతకాలి" అన్నాడతను.

ఆమె లేచి నిశ్చయంగా అన్నది. "గొంతు వుండదు, కూనిరాగం తీయడానిక్కూడా వీల్లేదు... మాట్లాడేందుకు వీల్లేదు.... కానీ, తినొచ్చు. ....తిరగొచ్చు. అంతేగా?" ఆమె కళ్ళలో చిత్రమైన వెలుగు....ఆ వెంటనే పెద్ద పెద్ద కళ్ళలో. నీళ్ళు....

కొద్ది క్షణాలాగి "చిన్నప్పటినుంచీ స్నేహితుడివి. నీకు తెలియాలి. గొంతు పోయిన తరువాత నేను బ్రతక నక్కరలేదు. బ్రతకడం అనవసరం. గొంతు ఉండగా త్వరగా పోతేనే మంచిది..." ఈ మాటలని ఆమె లోపలికి వెళ్ళిపోయింది_ ఇక చెప్పేదేమీ లేదన్నట్టు.

సేతురామన్ లేచాడు. అతని ఎదురుగా పెద్ద డాక్టరు వచ్చాడు. ఆయనకు నల భైఅయిదేళ్ళుంటాయి. అంత ప్రసిద్ధ గాయని పంకజవల్లి ఆస్పత్రిలో ఉన్నట్టు ఎవరికీ తెలియదు. ఆయన అనుకోకుండా రిజిష్టర్లో చూసి మూడు రోజుల క్రిందటే వచ్చాడు. ఫలానా అని తెలుసుకొని ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరై అన్ని వివరాలూ సేకరించి, ఇతర డాక్టర్లతో మాట్లాడి కేసు పూర్వాపరాలు విచారించాడు. తరువాత మళ్ళీ వచ్చి కోపంతో "అంతా అయిపోయిన తరువాత తీసుకొచ్చారా భార్యని ఇక్కడికి?" అని అడిగాడు. సేతురామన్ అంతా వివరంగా చెప్పగా విని నిట్టూర్చి వెళ్ళిపోయాడప్పుడు... నిన్నా మొన్నాకూడా వచ్చాడు.

ఇప్పుడు రాగానే "మీరిక్కడే వున్నారా?" అని అడుగుతూ గుమ్మందాటి లోపలికెళ్లాడు.

"మరెక్కడుంటాను?" అని గొణుక్కున్నాడు సేతురామన్. "కథ ముగిసే వరకూ ఇక్కడుండవలసినవాణ్నే .... తరవాత ఏమో" అనుకున్నాడు.

చేతి వ్రేళ్ళు విరుచుకుంటూ "ఆమె కొక్కసారి తెలివి వచ్చి కళ్ళు తెరిస్తే ... తాను ఒక్కమాట చెప్పగలిగితే ... తన గుండె చప్పుడు వినిపించగలిగితే ... ఎంత బాగుండును ..." అనుకున్నాడు. "వల్లీ! మై హార్ట్!! నేను మొదటినుంచీ నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్నే ప్రేమిస్తున్నాను."

అంతలో అకస్మాత్తుగా వెచ్చని గాలి కెరటం ఒకటి వింతగా... వెర్రిగా వీచింది. చెట్ల ఆకులు జలజల రాలాయి.

మరుక్షణంలో డాక్టరు బయటికి వచ్చి చప్పట్లు చరుస్తూ పెద్దగా "ఎవర్రా అక్కడ? రంగయ్యగార్ని రమ్మను... అర్జెంట్..." అని అరిచాడు.

సేతురామన్ కాళ్ళు వణికాయి వొణుకుతున్న వ్రేళ్ళతో జేబు తడివి బీడీ బయటకు తీశాడు. డాక్టరు అంతలో అతనివంక చూసి తల అడ్డంగా ఊపాడు.

సేతురామన్ వొణికే కాళ్ళతో నాలుగు అంగల్లో లోపలికి వెళ్లాడు. గాలి విసురుకు పంకజవల్లి ముఖం మీది దుప్పటి కొద్దిగా తొలగింది. వొణుకుతున్న వ్రేళ్ళతో కుషించిన ఆ చెక్కిళ్ళు నిమిరాడు. 'ఇదే నిన్ను నేను తాకడం' అనుకున్నాడు. కళ్ళవెంట నీళ్లు ధారాపాతంగా వచ్చేవేకానీ అంతలో దుప్పటి కప్పి, దుఃఖం మింగుకుని యివతలికి వచ్చాడు.

డాక్టరు నిన్న, యెవరో తెలిసిన పత్రికా విలేఖరికి ఈ విషయం మాటల సందర్భంలో చెప్పాడు. అతడిప్పుడు వచ్చాడు. డాక్టరు అతన్ని చూసి "నేన్నిన్న చెప్పలేదూ? ఆమె... ఇప్పుడే పోయింది" అన్నాడు.

'అరె' అన్నాడు పత్రికా విలేఖరి ఆశ్చర్యంతో.

పది పదిహేను నిమిషాలు గడిచాయి.

సేతురామన్ అలాగే స్తంభానికి ఆనుకొని నిలబడి చూస్తున్నాడు. లోపలి నుంచి శవాన్ని తీసుకురావడం, స్ట్రెచర్ మీద పడుకోబెట్టడం... అయిదారుగురు చేరారు. సన్న సన్నగా గొంతులు వినిపిస్తున్నాయి... ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

"ఎవరు? ఎవరుట పోయింది?"

"మొగుడేం చేస్తుంటాడు ?"

"పిల్లలేరా? ఏం జబ్బు?"

"పాటలు పాడుతుందా ?"

"ఏమైనా సినిమాల్లో పాడిందా ?"

స్ట్రెచర్ తోసుకుంటూ వెళ్ళిపోయాడొక వ్యక్తి. డాక్టరు అలాగే వరండాలో నిలబడి ఉన్నాడు.

సేతురామన్ కళ్ళు అప్పుడు నీళ్ళతో నిండాయి. చొక్కా చివరతో కళ్ళు తుడుచుకుని, వొణికే వ్రేళ్ళతో బీడీ నోట్లో పెట్టుకొని, గబగబా నడిచి ఆస్పత్రి గేటుదాటి, వీధిలోకి వచ్చి అటూ ఇటూ చూశాడు. . బడ్డీకొట్టు ప్రక్కనే వేలాడుతున్న తాడుతో బీడీ ముట్టించుకున్నాడు. ఒక్కసారి గుండెల నిండుగా పొగ పీల్చి వదిలాడు. అంతలో బీడీ విసిరి కొట్టి స్టేషన్ పక్క పేవ్‌మెంట్ మీద కొంతమేర చేత్తో తుడిచి అక్కడే ముడుచుకు పడుకున్నాడు. నీళ్లూరుతున్న కళ్ళను మూసుకున్నాడు. అంత లోనే అతనికి నిద్రపట్టింది.

నిద్రలో... గుంపులు గుంపులుగా పచ్చ పచ్చగా కళకళ్లాడుతున్న గంధపుచెట్లు తగలబడిపోతున్నట్టు కల ...